ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
06-12-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 89 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
జయభేరి



# సొంతింటి కలను నెరవేరుస్తాం

## తెలంగాణ వాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

**తెలంగాణలో అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు నిర్మించాలన్న లక్ష్యంతోనే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను జోడించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల కోసం ప్రత్యేకంగా యాప్ రూపొందించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో పాటు ఇతర మంత్రులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.**

**జయభేరి, హైదరాబాద్ :**

ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యం ఎంత గొప్పదైనప్పటికీ అమలులో లోపాలుంటే ప్రభుత్వంపై విశ్వసనీయత దెబ్బతింటుంది. పేదవారికి అన్యాయం జరుగుతుంది. అందుకే సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి ఏ ఒక్క ఇళ్లు కూడా అనర్హులకు చెందకూడదని ప్రత్యేకంగా యాప్ అందుబాటులోకి తెచ్చామని ఈ సందర్భంగా వివరించారు. ఇందిరమ్మ ఇండ్లను ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తాం. అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత కింద ఇండ్ల కేటాయింపు జరుగుతుంది. ముఖ్యంగా దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్... ఈ క్రమంలో ప్రాధాన్యత ఇస్తూ ఇండ్లను కేటాయిస్తాం. స్థలాన్ని గరిష్టస్థాయిలో వినియోగించుకుని నిర్మించుకునేలా లబ్దిదారుల కోసం ప్రతి మండల కేంద్రంలో ఒక నమూనా ఇంటిని నిర్మించి చూపిస్తాం. అచ్చం అలాగే కట్టాలని కాకుండా అవగాహన కోసం మాడల్ హౌజ్‌ను చూపిస్తాం. తొలి సంవత్సరంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్ల కేటాయింపులో భాగంగా మొత్తంగా 4.50 లక్షల ఇండ్లకు ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చాం. ఆదివాసీలు, ఆదివాసీ తండాలు (ఐటీడీఏ తండాలకు) జనాభా ప్రాతిపదికన ప్రత్యేకంగా పరిశీలించి

...మిగతాది 2 లో

# ‘మోడీఅదానీ ఏక్ హై’ ప్రతిపక్షాల నిరసన

## నిరసనలో పాల్గొన్న రాహుల్, ప్రియాంక గాంధీ



**జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 5:**

పార్లమెంటు వద్ద గురువారం అదానీ ‘ఇండిక్ట్ మెంట్’ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీలు విన్నూత్న నిరసన ప్రదర్శించారు. ‘మోడీఅదానీ ఏక్ హై’ అని రాసి ఉన్న జాకెట్లు ధరించి మరీ నిరసన ప్రదర్శించారు. గౌతమ్ అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) విచారణ చేపట్టాలని ప్రతిపక్షాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. గౌతమ్ అదానీతో పాటు, అతడి మేనల్లుడిని కూడా అమెరికా ప్రాసిక్యూటర్లు మోసగించిన అభియోగాలపై అపరాధులని తేల్చారు.ప్రతిపక్షాలు చేపట్టిన నిరసనలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కూడా బ్లాక్ హాఫ్ జాకెట్లను ధరించి మరీ నిరసన ప్రదర్శించారు. వారంతా గురువారం పార్లమెంటు కాంప్లెక్స్ లో ఈ నిరసన చేపట్టారు. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ మాట్లాడుతూ “ మోడీ, అదానీపై దర్యాప్తు జరపనివ్వడు, ఒకవేళ దర్యాప్తు జరగనిస్తే ఆయన మీద కూడా దర్యాప్తు జరగొచ్చు... మోదీ, అదానీ ఒక్కటే (మోడీ, అదానీ ఏక్ హై) ” అని వివరించారు.

# ముఖ్యమంత్రిగా ఫడనవీస్ ప్రమాణస్వీకారం



**జయభేరి, ముంబై, డిసెంబర్ 5:**

మహారాష్ట్రలో‘మహాయుతి’ ప్రభుత్వం కొలువుతీరింది. బిజెపి నేత ఫడనవీస్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. శివసేన నేత ఏక్ నాథ్ షిండే, ఎన్ సిపి నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆజాద్ మైదాన్ లో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సిపి. రాధాకృష్ణన్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జెపి నడ్డా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, ఏపి సిఎం చంద్రబాబు నాయుడు, ఎంపి సిఎం మోహన్ యాదవ్, యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్, రాజస్థాన్ సిఎం భజన్ లాల్ శర్మ, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల నుంచి 19 మంది ముఖ్యమంత్రులు హాజరయ్యారు.

# ఎపి ప్రభుత్వంతో గూగుల్ సంస్థ కీలక ఒప్పందం



- అంతర్జాతీయస్థాయి అవకాశాల కోసం యువతకు నైపుణ్య శిక్షణ
- ఎఐ రంగంలో అధునాతన ఆవిష్కరణలకు గూగుల్ సహకారం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో గూగుల్ అవగాహన ఒప్పందం

**జయభేరి, అమరావతి :**

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన తొలి అడుగు వేసింది. ఎఐ రంగంలో అధునాతన ఆవిష్కరణల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య కీలక ఒప్పందం జరిగింది. రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టిజి శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో గూగుల్ మ్యాప్స్ ఇండియా జనరల్ మేనేజర్ లలితా రమణి, ఎపి రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ నడుమ సచివాలయంలో అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం అంతర్జాతీయంగా ఎఐ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ లోని పాఠశాలలు, కళాశాలల్లో గూగుల్ సంస్థ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. దీంతోపాటు స్టార్టప్ లు, సాంప్రదాయ పరిశ్రమలు, చిన్న వ్యాపార సంస్థలకు అవసరమైన ఎఐ ఆధారిత సేవల కోసం శిక్షణ కార్యక్రమాలను చేపడుతుంది. ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ సుస్థిరత వంటి కీలకమైన అంశాల్లో ఎఐ&ఎంఎల్ సొల్యూషన్స్ ను ఏకీకృతం చేయడానికి గూగుల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరిస్తుంది. AI ఆధారిత వ్యవస్థలో ఆర్థిక వృద్ధి చెందడానికి అవసరమైన శిక్షణ, వనరులను యువతకు అందించడం ద్వారా నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి గూగుల్ సంస్థ సహకారాన్ని అందిస్తుంది. దీంతోపాటు AI రంగంలో అధునాతన ఆవిష్కరణలు, స్టార్టప్ ఎకో సిస్టమ్ ఏర్పాటుకు గూగుల్ సంస్థ సహకారాన్ని అందిస్తుంది.

...మిగతాది 2 లో



# ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై వేటు

**కృష్ణా జిల్లా రైతు భరోసా కేంద్రాల్లో జరిగిన అవకతవకలపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. రైతుల నుంచి ఎక్కువ ధాన్యం సేకరించి రికార్డుల్లో తప్పుడు లెక్కలు చూపించిన అధికారులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.**

**జయభేరి, అమరావతి :**

రైతులు ఇచ్చిన ఫిర్యాదుతో సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. కస్టోడియల్ ఆఫీసర్, టీమ్ లీడర్ ను (టీఏ) సస్పెండ్ చేశారు. విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించే విషయంలో కొన్ని అవకతవకలు జరుగుతున్నాయని సీరియస్ యాక్షన్ కు సంకల్పించారు. నిన్న టీడీపీ కార్యాలయంలో కొందరు మీడియా ప్రతినిధులు రైతులు ఏ విధంగా నష్టపోతోంది, పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే విచారణ జరిపించారు. ముఖ్యంగా కృష్ణా జిల్లాలోని పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ఏ విధంగా అవకతవకలు జరుగుతున్నాయి? అక్కడ టెక్నికల్ ఆఫీసర్, కస్టోడియల్ ఆఫీసర్ ధాన్యం సేకరణ విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నారు.. రైతుల నుంచి తీసుకున్న ధాన్యం బదులు కొంత తక్కువ మోతాదులో లెక్కల్లో చూపిస్తున్నారు.. ఈ విధంగా రైతులకు అన్యాయం చేస్తున్నారు అంటూ స్థానిక రైతులు అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని మీడియా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే సీఎం చంద్రబాబు యాక్షన్ తీసుకున్నారు. విచారణ చేయించి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయకుండా, రైతులను ఇబ్బంది పెడుతున్న పౌరసరఫరాల శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా హెచ్చరించారు.

# ఇది ఇందిరమ్మ రాజ్యమా..? ఎమర్జెన్సీ పాలనా?

## మండిపడ్డ బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీశ్ రావు



**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 5 :**

ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ కు వెళ్తే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై ఉల్టా కేసు బనాయించారని బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీశ్ రావు మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా..? ఎమర్జెన్సీ పాలనా? అని నిలదీశారు. ఉదయాన్నే పదుల సంఖ్యలో పోలీసులు ఎమ్మెల్యే ఇంటి మీదకు వచ్చి అక్రమ అరెస్టు చేసే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. ఈ దుర్మార్గాన్ని ప్రశ్నిస్తే తన, బి ఆర్ ఎస్ నాయకులపై దుర్మార్గంగా ప్రవర్తించారని ధ్వజమెత్తారు. అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కి తరలిస్తున్నారని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ రాక్షస పాలన కొనసాగిస్తున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి పిట్ట బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తెలంగాణ సమాజమే రేవంత్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుందన్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## సొంతింటి కలను నెరవేరుస్తాం

అదనంగా కొన్ని వేల ఇండ్లను నిర్మిస్తాం. ఇప్పుడు కేటాయించిన ఇండ్లు కాకుండా ఆదివాసీలకు ప్రత్యేక కోటా ఇస్తామన్నారు. గతంలో రుణాలు తీసుకుని ఇండ్లు కట్టుకున్న 7 వేల కుటుంబాల రుణాలను కూడా ప్రభుత్వం తీర్చి వారిని రుణ విముక్తులను చేస్తుంది. పెరిగిన ధరలు, పేదవాడి అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారికి ఇండ్లు కట్టుకోవడానికి అండగా నిలవాలని ఈ పథకం తీసుకొచ్చింది. పెరిగిన ధరలు, పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి పేద వాడికి 5 లక్షలు ఇచ్చి ఇండ్లు కట్టుకోవడానికి ప్రోత్సహిస్తుంది. 2004 నుంచి 2014 వరకు 25.04 లక్షల పేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వడం జరిగింది. 2014 2023 కాలంలో 1. 52 లక్షలు డబుల్ బెడ్రూమ్ ల నిర్మాణం చేపడితే వాటిల్లో 60 నుంచి 65 వేల ఇండ్లు మాత్రమే పూర్తి చేయగా, అర్థాంతరంగా వదిలేసిన ఇండ్లను పూర్తి చేయడానికి ప్రజా ప్రభుత్వం 195 కోట్లను కేటాయించింది. పేదలకు వెసులుబాటు కల్పిస్తూ విధివిధానాలను నిర్ణయించాం. అదనంగా ఒక గది కట్టుకుంటామంటే అందుకు వెసులుబాటు కల్పించాం. ఇదొక పండుగ సందర్భం. ఇండ్లు కట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. ఆత్మగౌరవంతో బతకాలన్నది ప్రతి ఒక్కరి కల. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటిముందు వెలుగుల్లో పండుగ చేసుకునే సందర్భమిది.

## ఎపి ప్రభుత్వంతో గూగుల్ సంస్థ కీలక ఒప్పందం

ఎంఓయు సందర్భంగా అమరావతి సెక్రటేరియట్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఈడిబి సిఇఓ సాయికాంత్ వర్మ, ఆర్టీజిఎస్ సీఈఓ దినేష్ కుమార్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి కార్తికేయ మిశ్రా, ఎపి ప్రభుత్వ ఇన్వెస్టిమెంట్స్ విభాగం ఉన్నతాధికారి యువరాజ్ పాల్గొన్నారు. పరిపాలన వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ను ఉపయోగించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలన్న ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనా విధానానికి అనుగుణంగా ఈ ఒప్పందం చేసుకుంటున్నామని గూగుల్ మ్యాప్స్ జనరల్ మేనేజర్ లలితా రమణి తెలిపారు. తాము ఎపి ప్రభుత్వంతో కలిసి చేపట్టే కార్యక్రమాలు భవిష్యత్తు ఎఐ ఆధారిత సేవల్లో సాధికారిత సాధించడానికి ఆలంబనగా నిలుస్తాయని అన్నారు. ఎఐ ద్వారా సమాజానికి సానుకూల ప్రయోజనాలను పెంచడానికి Google కట్టుబడి ఉంది. మేము ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సమస్యలకు పరిష్కారాల కోసం ప్రాథమిక పరిశోధనకు ప్రాధాన్యతనిస్తాం. విభిన్న కమ్యూనిటీల సహకారంతో వేగవంతమైన పురోగతి సాధించాలన్నది తమ లక్ష్యం. ఎఐ ద్వారా సమాజానికి సానుకూల ప్రయోజనాలను పెంచడానికి Google కట్టుబడి ఉంది. మేము ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సమస్యలకు పరిష్కారాల కోసం ప్రాథమిక పరిశోధనకు ప్రాధాన్యతనిస్తాం. విభిన్న కమ్యూనిటీల సహకారంతో వేగవంతమైన పురోగతి సాధించాలన్నది తమ లక్ష్యమని లలిత రమణి చెప్పారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజి శాఖల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఈజ్ ఆఫ్ లివింగ్ తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. దైనందిన జీవితంలో ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికేట్లు, సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి అందుబాటులో ఉండే సెల్ ఫోన్ వంటి సాధనం ఆయా సేవలను అందుబాటులోకి తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యువతకు ఎఐ ఆధారిత భవిష్యత్ అవకాశాలను కల్పించేందుకు గూగుల్ సంస్థ ఎపి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని తెలిపారు. ఎఐ ఆధారిత ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయడం, క్లిష్టమైన రంగాల్లో ఎఐ సేవలను వినియోగించడం ద్వారా కార్యకలాపాలను సులభతరం చేయడం, AIలో శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను నెలకొల్పడం, స్థానిక స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, ప్రజలకు ఎఐ ప్రయోజనాలకు అందుబాటులోకి తేవడం గూగుల్ ఒప్పందం ముఖ్యోద్దేశమని తెలిపారు. ఎఐ ఆధారిత సాధికారితకు అవసరమైన వర్క్ ఫోర్స్ ను తయారుచేయడంలో గూగుల్ కీలకపాత్ర వహిస్తుందని చెప్పారు. గూగుల్ తో తాము చేసుకున్న ఒప్పందం ద్వారా ఎఐ రంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోవడంతోపాటు యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ లభిస్తుందని, తద్వారా అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

గూగుల్ ఒప్పందంలోని కీలకాంశాలు

విద్య, నైపుణ్యాభివృద్ధి: విద్యార్థులు, డెవలపర్లకు ఎఐ ఆధారిత నైపుణ్యాల కోసం 10వేలమందికి గూగుల్ ఎసెన్సిషియల్ పేరుతో నైపుణ్య శిక్షణ కోర్సు అందిస్తుంది. రోజువారీ జీవితంలో AIని ఎలా ఉపయోగించాలి, ఎఐ ద్వారా ఉత్పాదకత, సామర్థ్యాన్ని పెంచడం వంటివి ఈ కోర్సులో అంతర్భాగంగా ఉంటాయి. సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ జనరేటివ్ AI వంటి రంగాల్లో Google క్లౌడ్ సర్టిఫికేషన్‌లు, స్కిల్ బ్యాడ్జ్‌లను గూగుల్ అందజేస్తుంది. ప్రభుత్వ ఏజెన్సీల కోసం స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లను అందించడానికి ప్రభుత్వంతో Google Cloud సహకరిస్తుంది. కంప్యూటర్ సైన్స్ విద్య కు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అధ్యాపకులకు గూగుల్ సాంకేతిక మద్దతును అందిస్తుంది. స్కిల్లింగ్ ఇనిషియేటివ్‌లలో Google డెవలపర్ కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లు, ఆండ్రాయిడ్, యాప్ స్కిల్లింగ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్‌లకు గూగుల్ ద్వారా యాక్సెస్ లభిస్తుంది.

స్టార్టప్ ఎకోసిస్టమ్ ఎనేబుల్ మెంట్: ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం, మెంటర్‌షిప్ , నెట్‌వర్కింగ్ అవకాశాలను అందించడం, స్టార్టప్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌ల కోసం Googleకి యాక్సెస్‌ని అందిస్తుంది. ఇందుకోసం Google సంస్థ ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌తో కలిసి పని చేస్తుంది. దీంతోపాటు అర్హత కలిగిన AI స్టార్టప్‌లు క్లౌడ్ క్రెడిట్‌లు, సాంకేతిక శిక్షణ వ్యాపార మద్దతును పొందుతాయి.

సుస్థిరత: గాలి నాణ్యత, పట్టణ ప్రణాళిక, విపత్తు నిర్వహణకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడంలో గూగుల్ ఎఐ ఆధారిత సహకారం, సేవలను అందిస్తుంది.


హెల్త్‌కేర్: నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపర్చడం, రోగి ఆరోగ్య ఫలితాలను వేగవంతం చేయడంలో ఎఐ సేవల వినియోగానికి సహకారం. హెల్త్ AI ఇమేజింగ్ మోడల్‌లకు యాక్సెస్ అందించడం, LLMలు ద్వారా హెల్త్‌కేర్ ఉత్పాదకరంలో AI అప్లికేషన్‌లను అన్వేషించడం, హెల్త్ AI డెవలపర్ ఫౌండేషన్స్ (HAIDEF) ద్వారా పరిశోధన కార్యక్రమాలకు గూగుల్ మద్దతు ఇస్తుంది.

AI పైలట్‌లు: వ్యవసాయం, ట్రాఫిక్ నిర్వహణ, వెబ్‌సైట్ ఆధునీకరణ, పౌరుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలలో క్లౌడ్ టెక్నాలజీ, AI ప్రయోజనాలపై కీలక రంగాలలో పైలట్ ప్రాజెక్ట్‌లకు Google సహకరిస్తుంది.

## నింగిలోకి దూసుకెళ్లిన పిఎస్ఎల్ విసి59


**బెంగళూరు, డిసెంబర్ 5:**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని స్పేస్‌పోర్ట్ నుంచి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రోబా3 మిషన్‌ను ప్రయోగించింది. బుధవారం, ఉపగ్రహ ప్రొపల్షన్ సిస్టమ్‌లో క్రమరాహిత్యం కనుగొనబడిన నేపథ్యంలో ప్రయోగం మళ్లీ షెడ్యూల్ చేసింది. భారత అంతరిక్ష సంస్థ దీనిని భారతదేశానికి గర్వకారణంగా పేర్కొంది. "లిఫ్టాఫ్ సాధించాం! పిఎస్‌ఎల్ వి - సి59 నింగిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది.ఎన్ఎస్ఐఎల్ నేతృత్వంలో గ్లోబల్ మిషన్ ప్రారంభం అయింది. ప్రోబా3 ఉపగ్రహాలను పంపించాం. అంతర్జాతీయ సహకారం, భారత కొలాబరేషన్, అంతరిక్ష విజయాలను కీర్తిస్తున్నా" అంటూ ఇస్రో ట్వీట్ చేసింది.సూర్యుడి ఉపరితలంపై ప్రోబా3 అధ్యయనం చేయనున్నది. ఈ ప్రయోగాన్ని ఇస్రో ప్రయోగించింది. ఈ ఉపగ్రహం 310 కిలోల కరోనా గ్రాఫ్ స్పేస్ క్రాఫ్ట్, 240 కిలోల ఓకల్టర్ స్పేస్ క్రాఫ్ట్ ను నింగిలోకి పంపారు. ఈ రాకెట్ ను 550 కిలోల బరువుతో ఇన్‌ఆర్బిట్ డెమోనిస్ట్రేషన్ లక్ష్యంగా ప్రయోగించారు. యూరోపియన్ అంతరిక్ష సంస్థతో కలిసి ఇస్రో అధికారులు సంయుక్తంగా దీనిని ప్రయోగించారు.



# రెండు దేశాల మధ్య మరింత దూరం

**బంగ్లాదేశ్, భారత్ మధ్య గ్యాప్ రోజు రోజుకూ ముదురుతోంది. బంగ్లాలో భారతీయులను, ముఖ్యంగా హిందూ మైనారిటీలకు వ్యతిరేకంగా ఘోరమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.**



**_చుట్టుపక్కల జనాలు మహిళా జర్నలిస్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తర్వాత, ఆమెను పోలీసులు తేజ్ గావ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఆమెను అరెస్టు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే, ఆమెను అరెస్టు చేయలేదని తర్వాతి రోజు బంగ్లాదేశ్ పోలీసులు వివరణ ఇచ్చారు. కాగా సాహాను వేధించిన వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వైరల్‌గా మారిన ఈ దాడి వీడియోలో.. 57 మంది ప్రాణాలు బలిగొన్న బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటుకు సంబధించి ఆమె ప్రజలను తప్పదారి పట్టించిదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా, భారతదేశానికి రాజకీయ శరణార్థిగా వచ్చినప్పటి నుండీ ఆ దేశంలో భారత వ్యతిరేకత బహిర్గతమయ్యింది. ఆమెను భారత్, శరణార్థిగా కాకుండా, రాజకీయ శరణార్థిగానే ప్రకటించినా బంగ్లాదేశ్ నేతలు మాత్రం.. ఆమెను తమ దేశానికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ వచ్చారు._**

ఎప్పుడు ఏ హిందువుపై దాడి జరుగుతుందో.. ఏ హిందూ నాయకుడు అరెస్ట్ అవుతారో అనే ఆందోళన పెరుగుతోంది. దీనితో, అటు బంగ్లాదేశ్‌లోనే కాక భారత్‌లోనూ నిరసనలు పెరుగుతున్నాయి. త్రిపురలో బంగ్లాదేశీయులకు భోజనం, వైద్య సేవలు బంద్ అంటూ భారీ ర్యాలీలు జరుగుతున్నాయ్. మరోవైపు, బంగ్లాభారత్‌తో సంబంధాల్లో మార్పు వచ్చిందనీ.. తిరిగి బలోపేతం చేస్తామంటూ రెండు దేశాలూ వ్యాఖ్యానిస్తున్నాయి.బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో రెండు దేశాల్లోనూ ఆందోళనలు పెరుగుతున్నాయ్. ఇటీవల, బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ టెంపుల్‌కు చెందిన గురువును పోలీసులు అరెస్ట్ చేయడంతో పరిస్థితుల మరింత దారుణంగా మారాయి. తర్వాత మరో హిందూ గురువును కూడా అరెస్ట్ చేసారు. దీనితో, బంగ్లాదేశ్‌లో, అసలు, తిలకం, కాషాయం వాడొద్దంటూ ఇస్కాన్ టెంపుల్, అక్కడి హిందువులకు సూచించే పరిస్థితి వచ్చింది.ఇటీవల, భారత ఏజెంట్ అంటూ ఒక జర్నలిస్ట్‌పై కూడా దాడి జరిగింది. బంగ్లాదేశ్‌కు వెళ్లే భారతీయ పర్యాటకులపై దాడులు జరుగుతున్నాయి. ఇటు, భారత్‌లో కూడా ఇలాంటి హైట్రేట్ కొనసాగుతోంది. త్రిపురలో బంగ్లాదేశానికి వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. త్రిపురలో బంగ్లాదేశీయులకు భోజనం, వైద్య సేవలు నిరాకరించాలని నిరసనకారులు పిలునిచ్చారు. అగర్తలలోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ఇక, త్రిపురలో జరుగుతున్న బంగ్లా వ్యతిరేక కార్యక్రమాలు వెస్ట్ బెంగాల్‌లో కూడా మొదలైతే..? పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతుందనడంలో సందేహం లేదు.బంగ్లాదేశ్‌లో మహ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం దేశంలో హిందువులు, భారతీయుల భద్రత గురించి అన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నప్పటికీ, వారిపై దాడులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. గత నెలలో, రాజధాని ఢాకాలో భారత పర్యాటకుడు సయన్ ఘోష్‌ను స్థానిక ప్రజలు దారుణంగా కొట్టారు. దాడి అనంతరం తాను ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు శ్యాంపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంటే.. పోలీసులు చర్య తీసుకోకపోగా.. బంగ్లాదేశ్‌కు రావడానికి గల కారణాలేంటంటూ ప్రశ్నించడం ప్రారంభించారని భాదితుడు ఘోష్ ఆరోపించారు.ఆ తర్వాత అగర్తల నుంచి కోల్‌కతా వెళ్తున్న బస్సుపై కూడా దాడి ఘటన వెలుగు చూసింది. బంగ్లాదేశ్‌లోని బ్రాహ్మణ బారియా జిల్లాలో అగర్తల నుంచి కోల్‌కతా వెళ్తున్న బస్సుపై దాడి జరిగింది. ఇలాంటి ఘటనలు చూస్తుంటే, భారతీయులకు బంగ్లాదేశ్ ఏ మాత్రం సురక్షితం కాదనే సందేహాలు వస్తున్నాయి. నవంబర్ 30న ప్రముఖ హిందూ మహిళా జర్నలిస్టుపై బంగ్లాదేశ్‌లో దాడి జరిగింది. బంగ్లాదేశ్‌ను భారత్‌లో భాగం చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపిస్తూ బంగ్లాదేశ్ సీనియర్ జర్నలిస్టు మున్నీ సాహాను అల్లరి గుంపు ఢాకాలో చుట్టుముట్టింది. సాహా ఒక భారతీయ ఏజెంట్ అనీ.. మాజీ ప్రధాని షేక్ హసీనాకు మద్దతుదారంటూ ఆమెను చుట్టుముట్టారు. ఆమెపై దుర్భాషలాడుతూ దాడికి చేసేందుకు ప్రయత్నించారు.చుట్టుపక్కల జనాలు మహిళా జర్నలిస్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తర్వాత, ఆమెను పోలీసులు తేజ్ గావ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఆమెను అరెస్టు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే, ఆమెను అరెస్టు చేయలేదని తర్వాతి రోజు బంగ్లాదేశ్ పోలీసులు వివరణ ఇచ్చారు. కాగా సాహాను వేధించిన వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వైరల్‌గా మారిన ఈ దాడి వీడియోలో.. 57 మంది ప్రాణాలు బలిగొన్న బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటుకు సంబధించి ఆమె ప్రజలను తప్పుదారి పట్టించిదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా, భారతదేశానికి రాజకీయ శరణార్థిగా వచ్చినప్పటి నుండీ ఆ దేశంలో భారత వ్యతిరేకత బహిర్గతమయ్యింది. ఆమెను భారత్, శరణార్థిగా కాకుండా, రాజకీయ శరణార్థిగానే ప్రకటించినా బంగ్లాదేశ్ నేతలు మాత్రం.. ఆమెను తమ దేశానికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. అక్కడ కొన్ని వర్గాలను రెచ్చగొట్టి, భారత్‌కి వ్యతిరేకంగా నిరసనలు పురిగొల్పడాన్ని తరచూ ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇస్కాన్ గురువు చిన్మయ్ కృష్ణదాస్‌ను దేశ ద్రోహిగా ప్రకటించడం దగ్గర నుండీ ఈ వివాదాలు మరింత తీవ్రం అయ్యాయి. ఈ క్రమంలోనే... బంగ్లాదేశ్ విద్యార్థులు.. బంగ్లాదేశ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలోకి వెళ్తూ.. ఆ సంస్థ గేటు దగ్గర నేలపై పరచి ఉన్న భారత జాతీయ జెండాను తొక్కుకుంటూ వెళ్తున్న దృశ్యం నవంబర్ 27న ఎక్స్‌లో ట్వీట్ చేయగా... సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు, భారతదేశానికి చెందిన టీవీ ఛానళ్లపై నిషేధం విధించాలని కోరుతూ అక్కడి హైకోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. బంగ్లాదేశ్‌లోని సుప్రీంకోర్టు న్యాయవాది ఈ పిటిషన్ వేసినట్లు తెలుస్తోంది.భారత టీవీ ఛానళ్లు బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయని సదరు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ దుష్ప్రచారం వల్ల రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల బంగ్లాదేశ్ సార్వభౌమత్వానికి ముప్పు వాటిల్లుతుందని వెల్లడించారు. ఈ పిటిషన్‌పై బంగ్లాదేశ్ హైకోర్టు వచ్చే వారం విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య భారత్‌లో కూడా బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు రేగాయి. బంగ్లాదేశ్‌లో హిందూ సన్యాసి చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్, అక్కడి హిందువులపై జరుగుతున్న దాడులపై త్రిపురలో నిరసన ర్యాలీ చేపట్టారు.త్రిపుర రాజధాని అగర్తలాలోని బంగ్లాదేశ్ అసిస్టెంట్ హైకమిషన్ వద్ద డిసెంబర్ 1న ఈ నిరసన ప్రదర్శన నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది నిరసనకారులు బంగ్లాదేశ్ ఎంబసీ ప్రాంగణంలోకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై దాడులతో పాటు.. భారతీయ జెండాను అగౌరవ పరిచినందుకు బంగ్లాదేశ్ నుండి వచ్చే అతిథులకు సేవలు నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు ఆల్ త్రిపుర హోటల్ & రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ తెలిపింది.అలాగే, బంగ్లాదేశ్‌కు చెందిన రోగులకు ఇకపై వైద్య సేవలు అందించబోమని అగర్తలాలోని ILS మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ప్రకటించింది. బంగ్లాదేశ్ పౌరులకు సేవలను నిలిపివేయాలని అభ్యర్థిస్తూ స్థానిక సంస్థలు చేసిన ర్యాలీ తర్వాత ఈ ప్రకటన వచ్చింది. కోల్‌కతాలోని మానిక్‌టాలా ప్రాంతంలోని JNరే అనే మరో హాస్పిటల్ కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకుంది. బంగ్లాదేశ్ రోగులకు చికిత్సను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ త్రిపురలో బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాన్ని చుట్టుముట్టిన ఘటనను ఖండించింది. అగర్తలాలోని బంగ్లాదేశ్ అసిస్టెంట్ హైకమిషన్ ప్రాంగణంలో భద్రతను ఉల్లంఘించడం చాలా విచారకరమని తెలిపింది. దౌత్య, కాన్సులర్ ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యంగా చేసుకోకూడదని పేర్కొంది. ఈ సంఘటన నేపథ్యంలో ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర డిప్యూటీ, అసిస్టెంట్ హైకమిషన్ల వద్ద భద్రతను పెంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.బంగ్లాదేశ్‌లో హిందువుల లక్ష్యంగా జరుగుతున్న దాడులపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, ఆ దేశంలో మైనారిటీలపై పెరుగుతున్న హింసాత్మక సంఘటనలను కేవలం మీడియా అతిశయోక్తిగా అని కొట్టి పారేయలేమని కూడా భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఇక, ఈ పరిణామాలన్నీ చూస్తుంటే.. భారత్‌బంగ్లాదేశ్ మధ్య గ్యాప్ అతకలేనంతగా మారుతుందేమో అనే సందేహాలు వస్తున్నయ్.

# కోల్ బెల్టులో దిగిన పిఆర్ఓలు...

- లోకల్ పాఠశాలలతో మూలకత్
- అరచేతిలో స్వర్గం చూపించేలా ప్రచారాలు
- తమ కళాశాలలో చేరితే బంగారు భవిష్యత్తు అంటూ మెప్పించే ప్రయత్నాలు..
- ఫోన్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు



**✍ జయభేరి, గోదావరిఖని:**

తమ కళాశాల... స్టేట్ లోనే టాప్ వన్ పొజిషన్లో ఉంది ... ఉత్తమ ర్యాంకులు.. ఉత్తమ విద్యా బోధన కు పెట్టింది పేరు తమ కళాశాలనే... మీరు ఊ అనండి.. మీ పిల్లల బంగారు భవిష్యత్తు మా చేతుల్లో పెట్టండి... నార్మల్ టీచింగ్... ఏసీ టీచ్చింగ్ అంటూ రెండు విధాలుగా ఉన్నాయి... మీరు ఎంత తొందరగా అడ్మిషన్ అయితే అంతా మంచిది... అంటూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను బుట్టలో వేసుకునేందుకు పి ఆర్ ఓ లు రంగంలోకి దిగారు. హైదరాబాద్, విజయవాడ, హనుమకొండ, కరీంనగర్ తదితర ప్రాంతాలలోని కార్పొరేట్ కళాశాలలకు చెందిన పీఆర్వోలు ఎప్పటిలాగే గోదావరిఖని క్షేత్రంలో అడుగుపెట్టారు. ఇక్కడ సింగరేణి, ఎన్ టి పి సి, కేశ రాం, బి థర్మల్ తదితర భారీ పరిశ్రమలకు నిలయంగా ఉండడంతో పిల్లల చదువు కోసం ఎన్ని లక్షలు అయినా దరపొస్తారని ప్రగాఢ నమ్మకంతో ఆయా కళాశాలలకు చెందిన పీఆర్వోలు ప్రతి ఏటా ఈ ప్రాంతానికి వచ్చి విద్యార్థులను అడ్మిషన్ల పేరుతో బుట్టలో వేసుకోవడం అనవైతిగా వస్తుంది. తర్వాత అడ్మిషన్లు పూర్తయ్యాక పి ఆర్ ఓ లు పలాయనం చిత్తగిస్తారు. ఇక నగరాలకు వెళ్లి ఆయా కళాశాలలో చేరే విద్యార్థులకు చుక్కలు చూపించడం పరిపాటే. ఇప్పుడు కూడా అదే పరిస్థితి మొదలవబోతోంది. పదవ తరగతి పరీక్షలు పూర్తి కాగానే ఆయా ప్రాంతాల నుంచి పిఆర్వోలు ఇక్కడికి చేరుకొని ముందుగా నగరంలోని హైస్కూల్ యాజమాన్యాలతో ములక్కాత్ అవుతున్నారు. మీ స్కూలు నుంచి ఇంతమంది అడ్మిషన్లు ఇస్తే మీకు కూడా కమిషన్ ఇస్తామంటూ నజరాణాలు ప్రకటిస్తున్నారు. ఇక పాఠశాల యాజమాన్యం నుంచి విద్యార్థుల అడ్రస్సులు, చిరునామాలు తీసుకొని నేరుగా భారీ ఇండ్ల వద్దకే వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి.. తమ కళాశాలలో చేరితే మీ పిల్లల భవిష్యత్తు ఎంతో బాగుంటుందని, ఇప్పటివరకు తమ కళాశాల నుంచి ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్, ఇంజనీర్లుగా స్థిరపడ్డారని మాయ మాటలు చెబుతూ తల్లిదండ్రులను పక్కదోవ పట్టిస్తుంటారు. అక్కడితో ఆగకుండా ప్రతిరోజు ఫోన్ చేస్తూ తమ కళాశాలలో చేరాలంటూ చివరకు ఎలాగోలా ఒప్పించి అడ్మిషన్ తీసుకొని వెళ్ళిపోతారు. తీరా కళాశాల ప్రారంభమయ్యాక చేసేదేమీ లేక పిల్లలను తీసుకువెళ్లి ఆ కళాశాలలో చేర్పించడం షరా మామూలే. ఇక అసలు డ్రామా ఇక్కడి నుంచే మొదలవుతుంది. అడ్మిషన్లు తీసుకున్న పిఆర్వోలు అక్కడ కనిపించరు. వాళ్ళు చెప్పిన ఆర్భాటాలు అక్కడ ఏ మాత్రం ఉండవు. పిల్లలను చేర్పించి వచ్చాక నెలరోజులు గడిచాక ఇక కళాశాల యాజమాన్యం నుంచి ఫీజులు పేరుతో వేధింపులు మొదలవుతాయి. అటు చూస్తే హాస్టల్ లో కూడా సరైన భోజనం ఉండగా పిల్లలు అనారోగ్యాల బారిన పడుతుంటారు. పోనీ విద్యార్థులను తీసుకొని వద్దామంటే టీసీలు ఇవ్వకుండా వేధిస్తుంటారు. గత్యంతరం లేక తల్లిదండ్రులు రెండేళ్లపాటు ఆ కళాశాల యాజమాన్యం వేధింపులను భరించాల్సి ఉంటుంది. మొదట చెప్పిన ఫీజుల కంటే తర్వాత అదనంగా మరింత ఎక్కువగా వసూలు చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండాలంటే పిఆర్ఓ లను ముందుగా ఇక్కడనే అడ్డుకోవాలంటూ స్థానికులు కోరుతున్నారు.

# ఆరు గ్యారెంటీలు.. హామీలకే పరిమితమా..!

■ మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 05 :**
కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్ హెగ్డేవ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఇచ్చిన హామీలు అమలు చేయలేదు కానీ విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నారు.జన్వాడ పామ్హౌస్ పై రేవంత్ రెడ్డి ఏందుకు చర్యలు తీసుకోవడం లేదుని తెలిపారు.కాంగ్రెస్ యువ వికాస్ కార్డు చూస్తే ఆరు గ్యారంటీల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మండలానికి అంతర్జాతీయ స్కూలు ప్రతి ఒక్క విద్యార్థికి ఐదు లక్షల విద్య భరోసా కార్డు అన్నారు. కానీ హే ఒక్క హామీ కూడా అమలు చేయలేదని చెప్పారు.ఈ యువ వికాస పేరు మీద నిన్న పెద్దపల్లిలో పెద్ద ఎత్తున సభ పెట్టి మేము ఏదో చేశాం అన్నట్టు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు.నేను ప్రతిరోజు డేబిట్లలో మాట్లాడుతూ ఉంటే ఏదో కాంగ్రెస్ పార్టీ గురించి గొప్ప చెబుతున్నారని ప్రజల్లోకి వచ్చి అడిగితే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఏది అమలు కాలేదనీ చెప్పారన్నారు. దళితులకు ఇస్తామన్న పదిహేను లక్షల రూపాయలు రాలేదు ఎవ్వి అని అడిగారు. మహిళలకు ఇస్తామన్న 2500 రూపాయలు ,రైతు భరోసా,రైతు బీమా,రైతు బంధు, ఇలా ప్రజలలో అడిగితుంటే కాంగ్రెస్ పార్టీకి చాలా వ్యతిరేకత మొదలైందని ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నట్టు నేడు నా దృష్టికి వచ్చింది తెలిపారు.ఇప్పటికైనా 6 గ్యారంటీలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోతే రాబోయే కాలంలో కాంగ్రెస్ గ్యారంటీ లపై పోరాటం కొనసాగిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర నాయకులు నందన్ గౌడ్, వెంకటరమణ, నాయకులు కుడీక్యాల రాములు, ఏల్లు రాంరెడ్డి, జస్వంత్ రెడ్డి, సింగం సత్తయ్య, శశిధర్ రెడ్డి, మనోహర్ యాదవ్,పంజాల అశోక్,సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులా..!

**జయభేరి, ములుగు, డిసెంబర్ 05 :**

ఉద్యమ నాయకుడు పదేళ్ల తెలంగాణ అభివృద్ధికై అహర్నిశలు శ్రమించిన మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే అరెస్ట్ ను ఖండిస్తున్నమని గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి కొమ్ము నవీన్ కుమార్ తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర పాలనపై తీవ్ర విమర్శలు చేసారు. ఈ సంవత్సర కాలంలో కాంగ్రెస్, యూటర్న్ ద్వంద వైఖరి, మోసపూరితమైన హామీలు నిస్సందేహమైన అబద్దాలతో ప్రజలను తెలంగాణను తప్పు త్రోవ పట్టించారాని, మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలె ప్రజాభవన్ పేరు పెట్టి ఓకే ఒక్కరోజు ప్రజా భవన్ కి వెళ్లి ప్రజా పాలనలో యూటర్న్ ,నాకు కాన్వాయ్ అవసరం లేదు నేను మీలో ఒకడినే అని ఇప్పుడూ మాట మార్చారని,ఆదానికి 100 కోట్లు రిటన్ ఇయ్యడంలో ,బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటికి వెళ్లి వారిని కాంగ్రెస్ లో చేర్చుకొని అది కాంగ్రెస్ కండువా కాదు దేవుని కండువా అని చెప్పించి కోర్టు ని ప్రజలని తప్పుద్రోవ పట్టే విధంగా అబద్ధం అడరని. ఇలా ప్రతి విషయంలో తెలంగాణ ప్రతిష్ట దిగజర్చే విధంగా తెలంగాణ ప్రజలు ఆర్థికంగా కోలుకోలేని విధంగా చర్యలు చెబెట్టుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం రాక్షస పాలనని తలపిస్తుంది అని అన్నారు, ప్రశ్నించే ప్రతిపక్షాలను అరెస్టు చేయడం మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు.

## మీ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 05 :**

అక్రమ అరెస్టులు, కేసులతో రేవంత్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని, నిర్బంధాన్ని ప్రయోగించి ప్రశ్నించే గొంతులు నొక్కెయాలని ప్రయత్నిస్తున్నదని గజ్వెల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ విమర్శించారు.ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి పాలనలో అడుగడునా హక్కులను కాలరాస్తూ రాజ్యాంగ విలువల్ని మంట గలుపుతుందని అన్నారు.ఆరు గ్యారంటీలతో పాటు ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఏడో గ్యారంటీ అని మాట్లాడిన రేవంత్ రెడ్డి మాటలు నీటి మీద రాతలే అయ్యాయని ఏద్దేవా చేశారు. కేవలం ప్రతిపక్ష నాయకులను అదుపు చేసేందుకే పోలీసులు పని చేస్తున్నారని రాష్ట్రంలో శాంతి భద్రతలు గాలికొదిలేశారని అన్నారు. నిత్యం అనేక చోట్ల హత్యలు, మానభంగాలు, దోపిడీలతో రాష్ట్రంలో క్రైమ్ రేట్ పెరుగుతూ ఉండగా ప్రభుత్వం మాత్రం ప్రతిపక్ష నాయకులను వేధించేందుకే పోలీసులను వాడుతుందని అన్నారు.ఆరు గ్యారంటీలను ఆమలు చేసి ప్రజలకి సంక్షేమ ఫలాలను అందించాలని అనునిత్యం ప్రభుత్వాన్ని నిలాదీస్తున్న ప్రతిపక్ష నేతలను అక్రమ కేసులు పెట్టి వేదించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అయినా నిర్బంధాలు అరెస్టులు బిఆర్ఎస్ పార్టీకి కొత్త కాదని వీటన్నిటిని ఎదుర్కొనే పోరాడి తెలంగాణ సాధించామని అన్నారు. అక్రమ కేసులు అరెస్టులతో brs నేతల గొంతు నొక్కలేరని ఆరు గ్యారంటీలను ఆమలు చేసే వరకు అవిశ్రాంతంగా ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని అన్నారు. ఈరోజు హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మీద అక్రమంగా కేసు నమోదు చేయడంతో సంగీభావం ప్రకటించడానికి వెళ్లిన హరీష్ రావు గారిని, మాజీ మంత్రులు mla లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రశ్నించే గొంతులను ఆపివేయాలనుకోవడం మూర్ఖత్వమని ఇప్పటికైనా ఇటువంటి చర్యలను ఆపివేసి పాలనపై దృష్టి పెట్టాలని లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలందరిని ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

# హరీష్ రావు అరెస్టును ఖండించిన ప్రతాప్ రెడ్డి

■ మాజీ మంత్రి హరీష్ రావు అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యం
■ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటెరు ప్రతాప్ రెడ్డి



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 05 :**
మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును అక్రమంగా అరెస్టు చేసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ తరలించడం పట్ల గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రతాపరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టులకు హరీష్‌రావు భయపడే నాయకుడు కాదని వారు తెలిపారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు వేల కేసులను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన నిలదొక్కుకున్నారని తెలిపారు. తాటాకు చప్పుళ్లకు హరీష్ రావు భయపడరని హెచ్చరించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఏం తప్పు చేశారని తన ఇంటికి వెళ్ళిన హరీష్ రావును కూడా అక్రమంగా అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల వైఫల్యం చెందిందని చెప్పారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేసే ప్రక్రియలో రైతులకు ఇంకా 29 వేల కోట్ల బకాయిలు ఉన్నందున రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫెయిల్ అయిందని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో సురక్షితమైన త్రాగునీరు అందించడంలో మౌలిక సదుపాయం కల్పించడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

# మానవ తప్పిదం.. మనుగడకు ప్రమాదం...

■ ప్రపంచ మృతిక దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ఏడిఏ బాబు నాయక్



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 05 :**
రైతు వేధిక గజ్వేల్లో రైతులకు ప్రపంచ మృత్తిక (నేల/భూమి)దినోత్సవం కార్యక్రమం పై గజ్వేల్ ఎడిఎ బాబు నాయక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేల కలుషితం కాకుండా భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన, స్థిరమైన సజీవ వనరుగా అందించడం మన బాధ్యత అన్నారు.నేల కలుషితం కాకుండా సహజ సూక్ష్మజీవుల పరిరక్షణ కోసం, నేల జీవ శక్తిని కొనసాగించాలి. విపరీతమైన రసాయన ఎరువులు, పురుగు మందులు, ఇతర రసాయన ఉత్పాదకాల వాడకంతో నేల స్వభావమే.మారిపోతోంది.తెలంగాణలో 22 రకాల నేలలు ఉన్నాయన్నారు. నల్ల, ఎర్ర, ఇసుక నేలల్లోనే అనేక రకాలు ఉన్నాయన్నారు. నీటి నిలువ సామర్థ్యం, పోషకాల లభ్యత నేల స్వభావం బట్టి ఉంటుందన్నారు. మన రాష్ట్రంలో అక్కడక్కడా చౌడు భూములు ఉన్నాయని వాటిని కూడా సాగులోకి తేగలమని అన్నారు. మన నేలల్లో సేంద్రియ కర్బనం తక్కువగా ఉందన్నారు. దీనిని సరిచేయడానికి పచ్చిరొట్ట (జీలుగ, జానుము మరియు పిల్లి పెసర) ఎరువులు వాడాలన్నారు. మన నేలల్లో సూక్ష్మపోషకాల లోపాలు కూడా ఉన్నాయన్నారు. వేసవి కాలంలో భూమిని వాలుకు అడ్డంగా దున్నుకోవడం వలన భూమి కోతకు గురి కాకుండా ఉంటుంది మరియు సారవంతమైన కర్బనా పదర్థాలు కొట్టుక పోకుండా ఉంటుందని నత్రజని వాడకాన్ని సగానికి తగ్గించవచ్చాన్నారు. దీని వలన ఖర్చు తగ్గడమేకాక నేలను పరిరక్షించవచ్చని అన్నారు. ఒక ఇంచు నేల ఏర్పడడానికి వందల సంవత్సరాలు పడుతుందన్నారు. 60 శాతం బోరు బావులు చాలా లోతునుండి నీళ్ళు తోడడం వల్ల లవణాలు పైకి వచ్చి నేలపై పొరగా ఏర్పడి దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. నేలపై మంచి మార్పు అయినా, చెడ్డ మార్పు అయినా చాలా నెమ్మదిగా వస్తుందన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి నేలను అందించాల్సిన బాధ్యత మన అందరి మీదే ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎఓ నాగరాజు,ఎఓ శైలజ,ఎఈఓ నవీన్, రైతులు పాల్గొన్నారు.

# వెంటనే పాల బిల్లును చెల్లించండి

■ ములుగు పాల కేంద్రం వద్ద నిరసన




**జయభేరి, ములుగు, డిసెంబర్ 05 :**
రెండు నెలలుగా పాడి రైతులకు చెల్లించాల్సిన పాల బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొంటూ ములుగు సమైఖ్య పాల శీతలీకరణ కేంద్రం ముందు పాడిరైతులు ధర్నాకు దిగారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన ములుగు వెలుగు సమైఖ్య ముందు పాడి రైతులు ధర్నా చేపట్టారు. పాల బిల్లులపై ఆధారపడి బ్రతికే మాకు కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. కూలీనాలీ చేసి పశువులను సాకితే కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు దేవుడెరుగు సంక్షోభంగా దిశగా మారమన్నారు.పాడి పరిశ్రమపై ఆధారపడిన మాకు పూట గడవడం కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.కాగా ములుగు మండల సమైఖ్య శీతలీకరణ కేంద్రానికి ములుగు, మర్కుక్, వర్గల్, తూప్రాన్ మండలాల్లోని 26 గ్రామాలకు చెందిన 452 మంది పాడి రైతులు పాలను విక్రయిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు సుమారుగా 74లక్షల రూపాయల పాల బిల్లు పెండింగ్ లో ఉన్నట్లుగా తెలిసింది. ఈ కార్యక్రమంలో పాడి రైతులు కర్ణకర్, మహిపాల్ రెడ్డి, స్వామి పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



## వెంటనే విడుదల చేయాలని డిమాండ్

**జయభేరి, ఉప్పల్ :**
మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుని అరెస్ట్ చేసి గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన విషయం తెలుసుకొని.. పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు. హరీష్‌రావుని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని, ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ లో ఉన్న మాజీ మంత్రి హరీష్ రావు, ఎల్ ఓ పీ మధుసూదనాచారి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, వివేకానంద, ఎమ్మెల్సీలు శంబిపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మర్రి జనార్ధర్ రెడ్డి, శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, పల్లె రవికుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవి ప్రసాద్, గోసుల శ్రీనివాస్, కార్పొరేషన్ మాజీ చైర్మెన్లు, ఇతర బీఆర్ఎస్ నాయకులు.

## మండల యూత్ అధ్యక్షుని సన్మానించిన డిసిసి అధ్యక్షులు



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 05 :**

వర్గల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా తుంకిఖల్సా గ్రామానికి చెందిన సాయి గౌడ్ ను మాజీ ఎమ్మెల్యే,డిసిసి అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కైవసం చేసుకునే విధంగా పనిచేయాలని వారు సూచించారు. అలాగే పార్టీ కోసం నిరంతరం కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం కాంగ్రెస్ పార్టీ కల్పిస్తుందని వారు తెలిపారు.

## రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

■ నర్సారెడ్డి బలపరిచిన అభ్యర్థులు గెలవడం సంతోషం



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 05 :**

యువజన కాంగ్రెస్ ప్రజాస్వామ్య బద్ధంగా జరిగినటువంటి అంతర్గత ఎన్నికలలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి బలపరిచిన యువజన కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడం జరిగింది ఈ సందర్భంగా గజ్వేల్ లో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తుంకుంట ఆంక్షరెడ్డి, సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా పొన్నాల రాజశేఖర్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులుగా సర్వర్ పాషా (అజర్), జిల్లా ప్రధాన కార్యదర్శిగా డప్పు గణేష్ మరియు నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు గజ్వేల్ ఎర్ర రాజశేఖర్ రెడ్డి, వర్గల్ పంజాల సాయి గౌడ్, మర్కుక్ శ్యామ్ గౌడ్, ములుగు జగదీశ్వర్ రెడ్డి, జగదేపూర్ క్రాంతి, కొండపాక బాబు, తూప్రాన్ శశి భూషణ్ రెడ్డి, మనోహరాబాద్ నవీన్ ఎన్నుకోబడ్డారు.

## భాజపా సభకు వెళ్లిన శ్రేణులు




**జయభేరి, కుకునూరుపల్లి, డిసెంబర్ 05 :**
భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై నిరసనగా కుకునూరుపల్లి మండల బిజెపి అధ్యక్షుడు అనుముల సంపత్ ఆధ్వర్యంలో గజ్వేల్ లో జరుగుతున్న సభకు (6 గ్యారంటీలు 66 అబద్ధాలు) బైక్ ర్యాలీ గా బయలుదేరారు.

## ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా..!



**జయభేరి, వర్గల్, డిసెంబర్ 05 :**
మాజీ మంత్రి హరీష్ రావు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని అక్రమ అరెస్టులను ఆపకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదుని వర్గల్ మండల బారాస అధ్యక్షుడు వేలూరు వెంకటరెడ్డి, సిద్దిపేట జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొచ్చి ఏడాది పూర్తయిన ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టకుండా, పోలీస్ వ్యవస్థను అడ్డుగా పెట్టుకుని అక్రమ అరెస్టులకు పాల్పడుతూ, ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ బెదిరింపులకు దిగుతున్నారని ఎలాంటి ఆధారాలు లేకుండా, కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి మాజీ మంత్రి హరీష్ రావు పై ఫిర్యాదు చేస్తే కేసులను బనాయిస్తూ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల పక్షాన పని చేయవలసిన బాధ్యత ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పై ఉందనే విషయాన్ని పాలకులు గ్రహిస్తే మంచిదిని తెలిపారు. సర్కార్ పనితీరును ఎండగడితే పోలీసులతో బెదిరిస్తూ ఇష్టానుసారంగా అరెస్టులకు పాల్పడడం దేనికి నిదర్శనం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు రమేష్ గౌడ్, మహేష్, జైక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు

# సబ్ డివిజన్ కార్యాలయంను సందర్శించిన జిల్లా ఎస్పీ




✍ జయభేరి, పరవాడ:

వార్షిక తనిఖీల్లో భాగంగా పరవాడ సబ్ డివిజన్ కార్యాలయం ను గురువారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సందర్శించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల సమస్యలను సానుకూలంగా విని వాటిని సామరస్యంగా పరిష్కరించేలా సబ్ డివిజన్ అధికారులను పర్యవేక్షించాలన్నారు. ఫోక్సో కేసులు, ఎస్సీ,ఎస్టీ కేసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని మరియు పరిశ్రములలో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.సబ్ డివిజన్ పరిధిలో జరిగే తీవ్రమైన కేసుల ఆరా తీశారు. ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు ఇచ్చారు. పెండింగ్ కేసులలో విచారణ వేగం పెంచి, త్వరితగతిన కోర్టుకు నివేదించాలా అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలను సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బ్యాంకులు మరియు ఏటీఎంల వద్ద, ముఖ్య కూడళ్ళ వద్ద సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసేలా ప్రజలకు ఇతర వ్యాపార సంస్థలకు అవగాహన కల్పించాలన్నారు. నిఘాను ముమ్మరం చేయడంలో భాగంగా మహిళా సంరక్షణ కార్యదర్శుల వారి పరిధిలో గ్రామాల్లో జరిగే సమాచారం పై చర్యలు చేపట్టాలని, అలాగే స్కూల్స్ లో మహిళా చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తదితర విద్యార్థులకు అవగాహన కల్పించేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు.సబ్ డివిజన్ కార్యాలయ ఉన్న రికార్డులను తనిఖీ చేసి, బ్యాడ్ క్యారెక్టర్ వ్యక్తులపై నిఘా కొనసాగించాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు మరియు రవాణా జరిగే మార్గాలలో ఆకస్మిక/డైనమిక్ తనిఖీలు నిర్వహించేలా అధికారులను అప్రమత్తం చేయాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలని, రోడ్డు భద్రతా నియమాల పట్ల ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు సబ్ డివిజన్ పరిధిలో విస్తృతం చేయాలన్నారు. జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీలు నిర్వహించిన సమయంలో పరవాడ సబ్ డివిజన్ డిఎస్పీ కె.వి. సత్యనారాయణ, సిబ్బంది హాజరు అయ్యారు.

## పంచాయతీ సమస్యలు వివిధ శాఖలపై సమీక్ష

✍ జయభేరి, పరవాడ:



పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో పరవాడ మండల ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం లో అన్ని శాఖల అధికారులు వారి నివేదికను చదివి వినిపించారు.ఈ సమావేశం లో రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయం , విద్య, ఆరోగ్య , గ్రామీణ నీటి పారుదల, గృహ నిర్మాణ, తదితర శాఖల పై ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు మండల అధికారుల తో సర్పంచ్ లు, ఎంపిటీసీ లు, ప్రజా ప్రతినిధులు వారి పంచాయతీ సమస్యలకు మరియు శాఖల పై సమీక్ష సమావేశం నిర్వహిస్తూ, ప్రతి శాఖలపై రివ్యూ లు జరుపుతూ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని, ప్రజలు ఇబ్బంది పడకుండా రోడ్లు , డ్రైనేజీలు తాగునీటి సమస్యలను వేగవంతం చేస్తూ పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో వివరించే అంశాలను దృష్టిలో పెట్టుకొని గ్రామ అభివృద్ధి కి తోడ్పడాలని కోరారు.



శాఖల వారిగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఎంపీపీ పైల ఆదేశించడం జరిగింది. అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజా ప్రతినిధులకు ఎ సమస్యలు ఉన్నా ఎంపీడీఓ, ఎంపీపీ దృష్టికి తీసుకురావాలని తక్షణమే అ సమస్య పరిష్కరనికి కృషి చేస్తామని తెలిపారు.ఈ యొక్క కార్యక్రమంలో పరవాడ జడ్పీటీసీ పి.ఎస్ రాజు, పరవాడ ఎంపీడీఓ శ్యామ్ సుందర్ ,పరవాడ ఎమర్వో అంబెద్కర్, పరవాడ మండలం వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, పరవాడ మండలంలో గల సర్పంచ్లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జ్

✍ జయభేరి, దేవరకొండ :



పెంచికల్పహాడ్ వద్ద ఉన్న మోడల్ స్కూల్ ను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాను సారం సీనియర్ సివిల్ జడ్జి కం దేవరకొండ మండల న్యాయ సేవ అధికారి సంస్థ చైర్మన్ కే అనిత ఆకస్మిక తనిఖీ చేపట్టారు. గురుకుల పాఠశాలల పనితీరు ఇటీవల తీవ్ర వివాదాస్పదంగా మారడంతో పాఠశాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. సందర్శించిన అనంతరం పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో అనేక సమస్యలు తిష్ట వేశాయని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు స్పష్టంగా కనబడుతుంది అని అన్నారు. ప్రతిరోజు విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు తినే ఆహారాన్ని తాను స్వయంగా భుజించామని ఆహారం ఏమాత్రం రుచికరంగా లేదని నాణ్యత పూర్తిగా లోపించిందని పేర్కొన్నారు. మోడల్ స్కూల్లో మంచినీటి సదుపాయం, టాయిలెట్స్, తరగతి గదుల డోర్లు మరమ్మత్తులు గురయ్యాయని తెలిపారు.ప్రతి తరగతి గది బూజుతో నిండి ఉండి కనీసం వెలుతురు లేకుండా ఉందన్నారు.

ముఖ్యంగా గత నాలుగు నెలల నుండి పాఠశాలలో విధులు నిర్వహించాల్సిన ఏఎన్ఎం విధులు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. పాఠశాల మొత్తం అపరిశుభ్రంగా ఉందన్నారు. తరగతిగదులు కూడా స్వయంగా విద్యార్థుల శుభ్రం చేస్తారని విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. కనీసం విద్యార్థులకు రావాల్సిన కిట్లు కూడా పంపిణీ చేయడం లేదని పూర్తి నిర్లక్ష్యం తో మోడల్ స్కూల్ నడపబడుతుందని వారు పేర్కొన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ప్రతి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సమస్యల పరిష్కారం కొరకు పాటుపడాలని , విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు గురికాకుండా వారికి పూర్తి స్వేచ్ఛ ప్రపంచంలో ఉండేటట్లు చదువును బోధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ పి రవీందర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కెవిఎస్ హరీష్ బాబు, వీరితోపాటు స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, సీఐ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## మరొకచోట ఫుడ్ పాయిజన్

✍ జయభేరి, దేవరకొండ :



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో దేవరకొండ పరిధిలో ఉన్నటువంటి పెంచికల్పాడు లోని మోడల్ పాఠశాలలో గురువారం రోజున ఐదుగురు విద్యార్థులు మధ్యాహ్న సమయంలో మోడల్ పాఠశాలలో భోజనం చేసిన తర్వాత ఐదుగురు విద్యార్థులకి ఫుడ్ పాయిజన్ అయ్యి వాంతింగ్స్ చేసుకొని ఇబ్బందులకు గురవుతున్న సమయంలో అక్కడికి ఏబీవీపీ కార్యకర్తలు వెళ్లి ఆ యొక్క విద్యార్థులను దేవరకొండ ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్లగొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద మాట్లాడుతూ... ఈ నల్గొండ జిల్లాలో పీఏ పల్లి మోడల్ కాలేజ్ హాస్టల్ లో జరిగిన ఫుడ్ పాయిజన్ అయ్యి కనీసం 24 గంటలు గడవక ముందే మరొకసారి దేవరకొండ మోడల్ స్కూల్లో ఫుడ్ పాయిజన్ అయి ఐదుగురు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. నల్గొండ జిల్లాలో ఈ సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్న గాని జిల్లా అధికారులు కావచ్చు మంత్రులు కావచ్చు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో హాస్టల్లో ఫుడ్ పాయింట్స్ జరుగుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటం ఈ ప్రభుత్వం సిగ్గుచేటు దున్నపోతు పై వర్షం కురిసినట్టు వివరిస్తూ ఈ సంఘటనలో చోటు చేసుకున్న వాటిని పరిమర్శించకుండా చేస్తున్న ఈ నల్లగొండ జిల్లా విద్యాధికారి కేవలం నల్లగొండ జిల్లా నే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుట్బాల్ నాణ్యతలేని ఆహారం తింటూ ఫుడ్ పాయిదాలతో హాస్పిటల్ బారిన పడుతున్నారని ఈ ఫుడ్ పాయిజన్ కారణంగా అనేకమంది విద్యార్థులు మరణించినప్పటికీ కూడా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందనిఅన్నారు. స్వయంగా సీఎం హాస్టల్స్ సందర్శించాలని అధికారులు సూచించినప్పటికీ కూడా ఎందుకు అధికారులకు ఇంత నిర్లక్ష్యమని మండిపడ్డారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి ఈ మోడల్ స్కూల్లోకి వస్తున్నటువంటి బియ్యం గోదాములన్ని తనిఖీలు చేసి నాణ్యమైన బియ్యాన్ని అందించాలి దీనికి కారణమైన వారి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.



## మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర మత్స్యకారులు

✍ జయభేరి, పరవాడ:

విశాఖపట్నం విచ్చేసిన ఎయిర్ పోర్ట్ లో ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను మత్స్యకారుల నాయకులు శాలువాతో సత్కరించి పుష్పాం గుచ్చం అందజేశారు.ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుతో పాటు ముత్యాలమ్మపాలెం సర్పంచ్, ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు చింతకాయల సూజాత ముత్యాలు శుభాకాంక్షలు. ఈ సందర్భంగా మత్స్యకార నాయుకులు మత్స్యకారుల సమస్యలపై మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్ళరు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాలరావు, మెరిగి రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎర్రా శ్రీను కుటుంబానికి ఆర్థిక సాయం



✍ జయభేరి, పరవాడ:

ఇటీవల రోడ్డు ప్రమాదంలో పరవాడ మండలం కలపాక పంచాయతీ మరిసివానిపాలెం గ్రామానికి చెందిన ఎర్రా శ్రీను (30)మృతి చెందారు. బుదవారం కలపాక పంచాయతీకి చెందిన గ్రామ పెద్దలు ప్రజలు కలిసి 55,000 రూపాయలను సమకూర్చి స్థానిక సర్పంచ్ బొండా కనకారావు మరియు ఎంపీటీసీ సప్ప ప్రభ సన్యాసి రావు చేతులమీదుగా మృతిని తల్లి ఎర్రా కొండమ్మకు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పెద్ద మనసుతో ముందుకు వచ్చి ఆర్థికపరంగా మృతిని ఎర్ర శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకున్న గ్రామ పెద్దలకు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ బోండా సరోజినీ, ఇందల రామారావు గురువు, గోకాడ జానకిరామ్ అక్కి రెడ్డి శ్రీను వాసు వార్డు నెంబర్, నాగిరెడ్డి శ్రీనాథ్, సాలాపు రమణోజి, ఎర్ర రమణ గురువు, బోండా గోవింద, ఈ నరసింగ రావు ఎస్సీ కాలనీ తుంపాల పెంటారావు, బోండా కనక వాలెంటర్, ఎర్ర కన్నయ్య, సాలాపు మహేష్, హేమంత్, ఎం కనకరాజు, వార్డు నెంబర్ సారి పిల్లి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

## టీకాలు వేయించడం వల్ల పారుడు రోగం రాకుండా అరికట్ట వచ్చు



✍ జయభేరి, మేడ్చల్:

గొర్రెలకు పారుడు రోగం రాకుండా టీకాలు వేయించుకోవాలని గొర్రెల పెంపకం దారులకు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్ సూచించారు. బుధవారం మేడ్చల్ మండలంలోని గోసాయిగూడ గ్రామంలో గొర్రెలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీకాలు వేయించడం వల్ల పారుడు రోగం రాకుండా అరికట్ట వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యుడు కురుమూర్తి, ఏఎంసి డైరెక్టర్ రేగురాజు, మూడు చింతలపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రామిడి శశిధర్ రెడ్డి, యూసుఫ్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

## లావుడి భాషకు దక్కిన అరుదైన జాతీయ అవార్డు బెస్ట్ సర్వీస్ సొసైటీ



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ కు చెందిన లావుడి భాష నాయక్ గత 25 సంవత్సరాల మంచి సమాజ సేవకు సంబంధించి హెల్త్ క్యాంపులు, అంగన్వాడి పాఠశాలలో రాత్రి బడిలో నిరక్షరాస్యులను అక్షరాసులుగా తయారు చేయడం, విలేజ్ డెవలప్ మెంట్ సొసైటీ ద్వారా తాగునీరు లేనటువంటి మారుమూల గ్రామాలు, గిరిజన తండాలను గుర్తించి బోర్ వెల్స్ వేయించి నీటిని అందించుట, ఇల్లు లేనటువంటి నిరుపేద గిరిజనులకు సింగిల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, స్వయం ఉపాధి పథకం కింద కుట్టు శిక్షణ, నిరుద్యోగ యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ, బంజారా మహిళల కుట్టు అల్లికలు, వీటి సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ అంతర్జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ బెస్ట్ సర్వీస్ సొసైటీ అవార్డును 2024 గాను అందించినారు.నా మీద నమ్మకం ఉంచి అవార్డును ఎన్నికచేసిన సెలక్షన్ కమిటీ నెంబర్ డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ బహుజన సాహిత్య అకాడమీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు



✍ జయభేరి, దేవరకొండ :

ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, డ్రాయింగ్ కాంపిటేషన్ నిర్వహించామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుజావుద్దీన్ హాష్మి పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు పాఠశాల డైరెక్టర్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ మొహమ్మద్ అన్వర్ హుస్సేన్ అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గుండ్లపోచంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నవీన్ కుమార్

✍ జయభేరి, మేడ్చల్ :

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీరంగవరం నవీన్ కుమార్ ముదిరాజ్ గెలుపొందాడు. మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం సంతోష్, నవీన్ కుమార్ పోటీ పడగా యూత్ అధ్యక్షుడిగా శ్రీరంగవరం నవీన్ కుమార్ దాదాపు 622 ఓట్లతో గెలుపొందాడు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు నవీన్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడే రక్తదాన శిబిరం



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ రెవెన్యూ శాఖ, మున్సిపల్ శాఖ, స్పోర్ట్స్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో నేడు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రాజస్వ మండల అధికారి ఎస్ రమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉదయం 10 గంటల నుండి రక్తదాన శిబిరం ప్రారంభం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమములో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు.రెవెన్యూ శాఖ , మున్సిపల్ శాఖ, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డిఓ కోరారు.

## ఈనెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ పలు అంశాలు ఈ సమావేశాల్లో చర్చించనున్నట్టు తెలుస్తోంది అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారనేది ఈనెల 9న జరిగే బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. సంక్రాంతి తరువాత రైతు భరోసా వేస్తామని సీఎం ప్రకటించారు. అయితే, అందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటికే పలు అంశాలతో కూడిన నివేదికను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చించి రైతు భరోసా. అర్హులైన రైతులకే దక్కేవిధంగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. కొత్తగా తీసుకురానున్న ఆర్వోఆర్ చట్టంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న కులగణన సర్వే ద్వారా వచ్చే గణాంకాలను అసెంబ్లీలో పెట్టి చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ రావాలని సీఎం రేవంత్‌రెడ్డి వివిధ సందర్భాల్లో డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సభకు కేసీఆర్ వస్తారా? లేదా? అనేదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

# అధికారుల తీరుపై రేవంత్ అసంతృప్తి

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 5:




రేవంత్ సర్కార్‌లోని కొందరు అధికారుల్లో ఒకరు ఈస్ట్ అంటే మరొకరు వెస్ట్ అంటున్నారట. ప్రభుత్వం ఒకటి చెప్తే తామొకటి చేస్తున్నారట. ఇన్నాళ్లు చూస్తూ వదిలేసిన సీఎం..వన్ ఇయర్ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూశాక..కొందరు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారట.ప్రతి చిన్న విషయానికి తాను చెప్తే తప్ప పనిచేయడం లేదని పలువురు IASల పని తీరుపై గుర్రుగా ఉన్నారట సీఎం. ఇక చేసేదేం లేదు ప్రక్షాళన చేపడుదామని ఫిక్స్ అయిపోయారట. కీలక శాఖల్లో ఉన్నత హోదాల్లో ఉండి సరిగ్గా పనిచేయని అధికారులను మార్చేయాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.వాళ్ల పొజిషన్‌లో ఎవరినీ తీసుకోవాలో కూడా ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అంతా అనుకున్నట్లు జరిగితే ఈ పది రోజుల్లోనే సెక్రటేరియట్‌లోని కీలక శాఖల అధికారుల మార్పులు, చేర్పులు ఉంటాయంటున్నారు. ఈ నేపథ్యంలో ఏ అధికారికి ఏం పోస్ట్ దక్కబోతుంది.? ఇప్పుడున్న పోస్ట్ కంటే తక్కువ పోస్ట్‌కు వెళ్లేదెవరు.? ఏ అధికారి అందల మెక్కబోతున్నారు.? లూప్ లైన్‌లోకి వెళ్లేదెవరనే చర్చ సెక్రటేరియట్‌లో హట్ టాపిక్ మారిందిసమీక్షల్లో సీఎం ఓ డైరెక్షన్‌లో ఆర్డర్స్ ఇస్తే ఔట్ పుట్ మాత్రం ఇంకోలా వస్తుందని భావిస్తున్నారట ప్రభుత్వ పెద్దలు. ప్రభుత్వంపై ప్రజల్లో అనుకున్నంత సానుకూలత లేకపోవడానికి అధికారుల తీరే కారణమన్న చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ హయాంలో పనిచేసినట్లు పలువురు అధికారులు సమర్థవంతంగా పనిచేయడం లేదన్న టాక్ వినిపిస్తోంది. సీఎంవోతో పాటు పలు శాఖల్లో ఉన్నతాధికారులు సమర్థవంతంగా పనిచేయడం లేదట. ఏదైనా అడిగితే ఏదో కారణం చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారట. ఇదే సీఎం రేవంత్ రెడ్డికి ఆగ్రహం తెప్పించిందంటున్నారు. అందుకే అందరినీ మార్చేయండి..పనిచేసే వాళ్లనే కీలక శాఖల్లో పెట్టండి అంటూ ఆర్డర్స్ ఇచ్చేశారట ముఖ్యమంత్రి.ప్రభుత్వం ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు దృష్టి పెట్టడం లేదట. కొత్తగా ఆదాయం పెంపు సంగతి పక్కన పెడితే..రెగ్యులర్‌గా ప్రభుత్వానికి వచ్చే ఆదాయమే పడిపోయిందట. అయినా అధికారుల్లో చలనం కనిపించడం లేదని ప్రభుత్వ పెద్దలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక నిర్మల్ జిల్లాలోని ఇథనాల్ ఫ్యాక్టరీ వివాదం విషయంలో కూడా అధికారులు ప్రభుత్వాన్ని ముందే అలర్ట్ చేయలేదంటున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం.కానీ ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా స్థానికులతో కలిసి ఉద్యమం చేసింది అదే బీఆర్ఎస్ పార్టీ. కానీ ఈ విషయాలను ఉన్నతాధికారులెవరు ప్రభుత్వం దృష్టికి తీసుకురాలేదట. దీంతో చివరికి ఇథనాల్ ఫ్యాకరీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. అధికారులు పట్టనట్లు వ్యవహరించడం వల్లే..ప్రభుత్వం బద్నాం కావాల్సి వస్తుందని భావిస్తున్నారట ప్రభుత్వ పెద్దలు.ఇక లగచర్ల ఘటన కూడా అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందన్న టాక్ వినిపిస్తోంది. భూసేకరణ విషయంలో ముందుచూపుతో వ్యవహరించకుండా..కలెక్టర్‌పై దాడి జరిగే వరకు వ్యవహారం వెళ్లింది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని, ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి ఉంటే సర్కార్ వెనకడుగు వేయాల్సి వచ్చేది కాదంటున్నారు.ఇదే క్రమంలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ విషయంలోనూ అధికారుల నిర్లక్ష్యం ఉందన్న అభిప్రాయంలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నారట. ఒక ఘటన జరగ్గానే వెంటనే రియాక్ట్ అయి చర్యలు తీసుకుంటే ఇష్యూ పెద్దది అయ్యేది కాదని..కానీ తమకెందుకులే అన్నట్లుగా వ్యవహరించడం వల్లే పరిస్థితి చేయిదాటిపోయే వరకు వచ్చిందంటున్నారు. వీటన్నింటికీ ప్రభుత్వ నిర్ణయాలు ఓ కారణమైతే..అధికారుల పనితీరు సరిగ్గా లేకపోవడమే కారణమన్న టాక్ వినిపిస్తోంది.ఇప్పటి వరకు జరిగిన డ్యామేజ్ జరిగిపోయింది. ఇక రెండో ఏడాదిలో అయినా అన్ని లక్ష్యాలను సాధించాలని ఫిక్స్ అయిపోయిందట రేవంత్ సర్కార్. అందుకే బాధ్యతాయుతంగా పనిచేయని అధికారులను ఉపేక్షించొద్దని..ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చుకునే బదులు.. మరో అధికారితో పనిచక్కబెట్టుకోవాలని భావిస్తున్నారట ప్రభుత్వ పెద్దలు. ఏ అధికారి బదిలీ అవుతారో.. ఎవరికి లూప్ లైనే దిక్కవుతుందో చూడాలి మరి.



## కవిత చేతికి పార్టీ పగ్గాలు...

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 5:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తర్వాత ఆ పార్టీ పగ్గాలు ఎవరు తీసుకుంటున్నారు? తొలుత కేటీఆర్‌కే పగ్గాలు అందుకుంటారని నేతలు భావించారు. ఈలోగా కవిత తెరపైకి రావడానికి కారణాలేంటి? అధినేత ఆలోచన ప్రకారమే అంతా జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు బలంగా చెబుతున్నాయి.అధికారం పోయిన తర్వాత కారులో భారీగా కుదుపులు మొదలయ్యాయి. ఓ వైపు నేతలు వలసలు.. మరోవైపు లీడర్ షిప్ కోసం ఎత్తుకు పైఎత్తులు తీవ్రమయ్యాయి. కాంగ్రెస్ సర్కార్‌ని ఎదుర్కోవాలంటే కేటీఆర్ బెటరని భావించారు పెద్దాయనకేటీఆర్ రంగంలోకి దిగేశారు.. ప్రతీ విషయాన్ని భూతద్దంతో చూపించే ప్రయత్నం చేశారు. ఈలోగా ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్ పేరు వచ్చినట్టు ప్రచారం సాగింది. అదే క్రమంలో ఫార్ములా ఈ రేస్ వ్యవహారంపై వర్కింగ్ ప్రెసిడెంట్ మెడకు చుట్టుకోవడం, ఆపై కేసు నమోదు కావడం జరిగిపోయింది.ప్రస్తుతం ఆ కేసుకు సంబంధించి దర్యాప్తు లోతుగా జరుగుతోంది. రేపో మాపో కేటీఆర్ అరెస్ట్ కావడం ఖాయమంటూ ప్రచారం సాగింది. ఒకవేళ కేటీఆర్ అరెస్టయితే పార్టీ పగ్గాలు ఎవరు చేపట్టాలనే దానిపై కేసీఆర్ మల్లగుల్లాలు పడ్డారట. హరీష్‌రావుకి పగ్గాలు అప్పగించేందుకు కేటీఆర్, కవిత మొగ్గు చూలేదని గుసగుసలు.పార్టీ పగ్గాలు కొద్దిరోజులపాటు కవితకు ఇస్తే బెటరని కేటీఆర్, కేసీఆర్ చర్చించుకున్నా రట. ఆ తర్వాత ఆమె పేరు తెరపైకి రావడం, ఆపై తెలంగాణ జాగృతి సభ్యులతో సమావేశం కావడం చకచకా జరిగిపోయాయి. ఐదురోజులపాటు ఉమ్మడి జిల్లాల నేతలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు కవిత. పార్టీలో జరుగుతున్న పరిణామాలను హరీష్‌రావు వర్గీయులు గమనిస్తున్నారు. అయితే మంగళవారం చక్రధర్ గౌడ్ ఫిర్యాదుతో హరీష్‌రావుపై కేసు నమోదు చేయడం చకచకా జరిగిపోయింది. దీంతో కవితమ్మకు లైన్ క్లియర్ అయ్యింది .ఈ క్రమంలో కేసీఆర్ తన కూతురుకు కొన్ని సలహాలు, సూచనలు చేశారట. దాని ప్రకారమే అడుగులు వేస్తోందామె. రేవంత్ సర్కార్ ఏడాది సందర్భంగా బీఆర్ఎస్‌లో చాలానే మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సరిగ్గా ఏడాదిపాటు పార్టీని నడిపించిన కేటీఆర్.. ఇప్పుడు దూరంగా ఉన్నారు.పార్టీ పగ్గాలు కవిత చేతికి వచ్చాయి. ఈమె కూడా ఏడాది పాటు కొనసాగుతారా? మధ్యలో మళ్లీ ఏమైనా మార్పులు జరుగుతాయా? అన్న ప్రశ్నలు గులాబీ శ్రేణుల్లో మొదలైపోయింది. పార్టీలో జరుగుతున్న అంతర్గత వ్యవహారాలపై గులాబీ నేతలు గమనిస్తున్నారు.



## కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి

- అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 5:

బీఆర్ఎస్ నేతలపై మంత్రి కొండ సురేఖ తీవ్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం తాగే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మంత్రి పదవి ఇచ్చారని బిఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. కోమటిరెడ్డి బ్రదర్స్ గురించి మాట్లాడే అర్హత బిఆర్ఎస్ నేతలకు లేదని దుయ్యబట్టారు.ఈ మేరకు ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ కోసం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిజంగా రాజీనామా చేశారని.. మంత్రి వెంకట్‌రెడ్డి గురించి గంధపు చెక్కల వ్యాపారి ఒకరు అగౌరవంగా మాట్లాడారని.. హుజురాబాద్ ఎమ్మెల్యే మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఫైరయ్యారు. బిఆర్ఎస్ నేతలకు అధికారం పోయిన తర్వాత కార్యకర్తలు గుర్తుకు వచ్చారని విమర్శించారు. అసెంబ్లీకి రాని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతారు?.. కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.

## మా ఏసీపీ సార్ నే అడగండి..!


- మున్సిపల్ ఆఫీస్ కి కూతవేటు దూరంలో అక్రమ నిర్మాణం చోద్యం చూస్తున్న అధికారులు
- అంతా ఏసిపి ప్రతాప్ మాయే అంటున్న స్థానికులు
- ఏసిపి బడా బాబుల అక్రమ నిర్మాణాల జోలికి వెళ్ళడంట
- బయట కలరు వేసుకొని లోపల పని చేసుకోమని ఉచిత సలహాలు

జయభేరి, సిటీ ప్రతినిధి, డిసెంబర్5 :



మున్సిపల్ కార్యాలయముకు కూతవేటు దూరంలో అక్రమ నిర్మాణం జరుగుతుందంటే ఆ అక్రమ నిర్మాణదారులకు అధికారులు ఏ విధంగా సహకరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఎల్బీనగర్ సరూర్నగర్ సర్కిల్లలో పలు డివిజన్లో ఏసిపి ప్రతాప్ అండదండలతో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. ఏసీపీ ప్రతాప్ అండదండలు మాకు ఉన్నన్ని రోజులు ఎన్ని అక్రమ నిర్మాణాలు చేసుకున్న ఏమి కాదులే అన్న ధీమాతో జి ప్లస్ టు అనుమతులు తీసుకొని నాలుగు ఐదు అంతస్తులు ఎలాంటి సెట్ బాకులు లేకుండా నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్న స్థానికులు. ఏసిపి ప్రతాప్ లక్షల్లో జీతాలు తీసుకుంటూ ఇలాంటి అక్రమ నిర్మాణాలకు సహకరిస్తుకక్కుర్తి పడుతున్నాడు ఏంటి అని విమర్శిస్తున్న స్థానిక ప్రజలు. కిందిస్థాయి సిబ్బంది చైన్ మేన్లకు ఫిర్యాదులు చేస్తే మాకు ఏం తెలియదు అంతా మా ఏసీపీ సార్ నే అడగండి అంటూ, మా ఏసిపి సార్ చెప్తేనే అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకుంటాము అంటూ బుకాయిస్తున్నారు. బయట కలరు వేసుకొని లోపల పని చేసుకొండని, మేము నోటీసులు ఇస్తే కోర్టు ద్వారా స్టే తెచ్చుకొని పని చేసుకోమని ఉచిత సలహాలు కూడా ఇస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఏసీబీ ప్రతాప్ నిజాయితీగా డ్యూటీ చేస్తే ఎల్బీనగర్ సరూర్నగర్ సర్కిళ్లలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగవని, ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండి పడకుండా కాపాడొచ్చని, కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా ఏసీపీ ప్రతాప్ కిందిస్థాయి సిబ్బంది అక్రమ నిర్మాణాలకు సహకరించకుండా మున్సిపల్ ఆదాయానికి గండి పడకుండా కాపాడాలని డిమాండ్ చేస్తున్నస్థానిక ప్రజలు.

## జిల్లాల్లో అంతర్ పంటగా గంజాయి



జయభేరి, అదిలాబాద్. డిసెంబర్ 5:

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు జోరుగా సాగుతుంది. ఇందుకు సంబంధించి పక్కా సమాచారం అందటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఏజెన్సీ ప్రాంతాల పై స్పెషల్ ఫోకస్ పెట్టి.. నిందితులను కటకటాల్లోకి పంపుతున్నారు. రవాణ సౌకర్యం లేని ప్రాంతాల్లో, అటవీ పరిసర ప్రాంతాల్లో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.ఈ క్రమంలో జిల్లా పోలీసులు అప్రమత్తయ్యారు. పక్కా సమాచారంతో గంజాయి క్షేత్రాల పై దాడులు చేపట్టారు. ఇంటెలిజెన్సీ నిఘా నివేదిక ప్రకారం... ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కొందరు ఎక్సైజ్ శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో నేరుగా పోలీసులే రంగంలోకి దిగారు. విస్తృతంగా దాడులు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే... చాలా ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు.కడెం, పెంబి దస్తురాబాద్ పరిధిలోని మారుమూల గిరిజన గూడాల్లో గంజాయి సాగు ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు దాడుల్లో తేలింది. దట్టమైన అడవిగా పేరు గాంచిన అల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో కొందరు పోడు వ్యవసాయం చేస్తున్నారు. మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ఏరియాగా కూడా గుర్తింపు పొందింది. అయితే ఇక్కడ నివాసం ఉంటున్న కొందరు... గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కంది పంటను పోలి ఉండే గంజాయి మొలకల ద్వారా దందాను కొనసాగిస్తున్నారు.నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి శర్మల ఆధ్వర్యంలో స్వయంగా పోలీసులు సోదాలు నిర్వహించారు. అల్లంపల్లి అటవీ పరిధిలోని మంగల్ సింగ్ తాండ, బాబా నాయక్ తండా మధ్య ఉన్న దట్టమైన అడవుల్లో తనిఖీలు చేపట్టారు. ఇక్కడ అంతు చిక్కని రీతిలో పోలీసులకు 70 లక్షలకు పైగా విలువైన గంజాయి పట్టుబడింది. ప్రధాన సూత్రదారులను ఆరుగురిని అరెస్టుచేశారు. గత ఏడాది కడెం మండలం ఇస్లాంపూర్ ప్రాంతంలో భారీ ఎత్తున పంట సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు.గంజాయి సాగు పెద్దు ఎత్తున ఉన్నప్పటికీ అబ్కారీ శాఖ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. మొక్కుబడిగా కొన్నిచోట్ల సోదాలు చేస్తూ... నిందితులను అరెస్టు చేసిచేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. గంజాయికి బానిస అవుతూ యువత పక్కదారే పట్టే అవకాశాలు ఉన్నాయని... ఎక్సైజ్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. గంజాయి సాగుతో పాటు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. ఇటీవలే పలుచోట్ల జరిపిన తనిఖీల్లో భారీగా గంజాయిని పట్టుకున్నామని చెప్పారు. యువతను పెడదోవ పట్టకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## జీహెచ్ఎంసి ముందు కాలనీ వాసుల అందోళన


జయభేరి, హైదరాబాద్:

ఉప్పల్ లో అక్రమ కట్టడాలను జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రోత్సహిస్తున్నారని జిహెచ్ఎంసి ముందు సెవెన్ హిల్స్ కాలనీవాసులు ధర్నాకు దిగారు. కోర్టు కేసులో ఉన్న చర్చి స్థలంలో నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఉప్పల్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు జిహెచ్ఎంసి కమిషనర్ ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.

# మేడారంలో ఏం జరుగుతోంది... వరుస సంఘటనలతో భయం..భయం

జయభేరి, వరంగల్, డిసెంబర్ 5:

వరుసగా పూజారులు చనిపోయారు. నెలల వ్యవధిలోనే ప్రాణాలు విడిచారు. దాన్ని మర్చిపోకముందే హోరుమంటూ సుడిగాలి వచ్చింది. వేలాది వృక్షాలను నేలమట్టం చేసింది. ఇది జరిగిన కొద్ది రోజులకే భూకంపం వచ్చింది. వీటన్నింటికీ మేడారం, దాని చుట్టుపక్కల ప్రాంతాలు కేంద్రం కావడం కలకలం రేపుతోంది. చూస్తుంటే ప్రకృతి ఏదో మనకు చెప్పాలని చూస్తోంది.ఒక ఘటన జరిగితే ఈ యాదృచ్ఛికమంటాం.. మరోసారి జరిగితే దురదృష్టం అంటాం. ఇంకోసారి జరిగితే దారుణం అంటాం. ఇప్పుడు మేడారం విషయంలోనూ అదే జరుగుతోంది.. దట్టమైన అడవికి కేంద్రంగా.. సమ్మక్క సారలమ్మ కు విడిదిగా మేడారం ఉంది. ఈ మేడారంలో రెండు సంవత్సరాలకు ఒకసారి ఫిబ్రవరి నెలలో జాతర జరుగుతుంది.. ఇది ఆసియా ఖండంలోనే అత్యంత పెద్దదైన గిరిజన జాతర. ఈ జాతరకు లక్షలాదిమంది భక్తులు వస్తుంటారు. దీనిని తెలంగాణ కుంభమేళాగా పేర్కొంటారు. అటువంటి ఈ ప్రాంతంలో మేడారం జాతరను గిరిజన పూజారులు దగ్గరుండి నిర్వహిస్తారు. వారి పూజా విధానం కూడా భిన్నంగా ఉంటుంది.అయితే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో పూజలు నిర్వహించే పూజారులు ఇటీవల చనిపోయారు. నెలల వ్యవధిలోనే అనారోగ్యానికి గురై కన్నుమూశారు. పూజారులు ఇలా చనిపోవడం మిగతా వారికి సహజ ప్రక్రియ లాగా కనిపించినప్పటికీ.. ఆ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు మాత్రం ఏదో కీడు లాగా అనిపించింది. ఈ ఘటన జరిగిన కొద్ది రోజులకే ఇటీవల బీభత్సమైన గాలి ఆ ప్రాంతంలో వచ్చింది. మేడారం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న అడవిని నేలమట్టం చేసింది. వేలాది వృక్షాలు నేలకూలాయి. ఈ ఘటన జరిగే ఒకరోజు ముందు అక్కడ ఉండే కోతులు, దుప్పులు, ఇతర అటవీ జంతువులు కేకలు




వేసుకుంటూ భయపడి దూరంగా వెళ్లిపోయాయి. అవి వెళ్లిపోయిన మరుసటి రోజు అక్కడ చండ ప్రచండమైన వేగంతో గాలులు వీచాయి. వేలాది వృక్షాలు నేలకొరిగాయి. వీటిని ప్రకృతిలో జరిగే మార్పు అని శాస్త్రవేత్తలు కొట్టి పారేసినప్పటికీ.. ఏదో జరుగుతోందనే భయం మాత్రం ఇక్కడి ప్రజల్లో ఉంది.ఇక బుధవారం తెలుగు రాష్ట్రాలలో నమోదైన స్వల్ప భూకంపం మేడారం కేంద్రం గానే మొదలైంది. బుధవారం ఉదయం మేడారం గద్దె స్వల్పంగా ఊగింది. ఉదయమే అమ్మవార్లకు పూజలు చేయడానికి ఓ మహిళ అక్కడికి వచ్చింది. ఆమె అక్కడికి చేరుకోగానే కొంత సమయం తర్వాత గద్దెలు ఊగినట్టు కనిపించింది. ఆమెలో ఆందోళన మొదలైంది. ఆ తర్వాత ఈ విషయాన్ని బయటికి వచ్చి చుట్టుపక్కల ఉన్న వాళ్లకు చెప్పింది. ఆ తర్వాత వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో భూమి స్వల్పంగా కంపించింది. అయితే ఈ సంఘటనలు మొత్తం మేడారం, దాని చుట్టుపక్కల ప్రాంతాల కేంద్రంగా జరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. "మొన్న పూజారులు చనిపోయారు. నిన్న భారీగా చెట్లు కూలిపోయాయి. ఇవాళ భూకంపం వచ్చింది. చూస్తుంటే ఏదో జరుగుతోంది.. పెనువిపత్తు సంభవిస్తుందా? ప్రకృతి ఏమైనా చెప్పాలి అనుకుంటున్నదా? వీటన్నింటికీ మేడారం, దాని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలు కేంద్రాలు కావడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల జరిగిన జాతరలో అమ్మవార్లకు ఏమైనా తక్కువ జరిగిందా? జాతర నిర్వహణలో ఏదైనా అపచారం చోటు చేసుకుందా?" అనే అనుమానాలు మేడారం వాసుల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఇవన్నీ ప్రకృతిలో సంభవించే మార్పులేనని, వీటికి విపరీతార్థాలు తీయొద్దని శాస్త్రవేత్తలు అంటున్నారు. మూఢనమ్మకాలను వ్యాప్తి చేయొద్దని సూచిస్తున్నారు.

### భయం..భయం

మేడారం కేంద్రంగా భూ ప్రకంపనలు చోటు చేసుకోవడం సంచలనం కలిగిస్తోంది. భూ ప్రకంపనల వల్ల పెద్దగా నష్టం చోటు చేసుకోకపోయినప్పటికీ శాస్త్రవేత్తలు అధ్యయనంలో సరికొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి.. భూమికి ఐదు నుంచి 40 కిలోమీటర్ల లోతులో తక్కువ వ్యవధిలో భూ ప్రకంపనలు రావడంతో భూకంపం తీవ్రత స్వల్పంగా ఉందట. ఒకవేళ ఇది గనుక భూమికి 10 కిలోమీటర్ల లోతులో గనుక వచ్చి ఉంటే ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండేదట. 35 కిలోమీటర్ల లోతులో భూ ప్రకంపనలు చోటు చేసుకోవడంతో ఉపరితలం పైన స్వల్పంగానే ప్రకంపనలు వచ్చాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.తెలంగాణలో మేడారం కేంద్రంగా బుధవారం ఉదయం భూ ప్రకంపనలు చోటు చేసుకోవడం సంచలనం కలిగించింది. అయితే ఇక్కడ మాత్రమే ఎందుకు భూ ప్రకంపనలు వచ్చాయనే ప్రశ్న అందరిలోనూ తలెత్తుతోంది. భూమి అనేది అనేక పొరలతో నిర్మితమై ఉంటుంది. ఈ పొరలు కదిలినప్పుడు మాత్రమే భూ ప్రకంపనలు చోటుచేసుకుంటాయి. జియాలాజికల్ సైంటిస్టుల అభిప్రాయం ప్రకారం భూమి ఉపరితలం కింద ఒక స్థానం ఉంటుంది. దానిని భూకంప కేంద్రం అంటారు. భూకంపం తీవ్రంగా వస్తే.. దాని ప్రభావం చాలా దూరం వరకు ఉంటుంది. ఉదాహరణకు 0.5 నుంచి 5.9 వరకు రిక్టర్ స్కేల్ పై నమోదైతే దానిని జియోలాజికల్ పరిభాషలో స్వల్ప భూకంపం అంటారు.. అప్పుడు భూమి కంపించిన తీరుకు ఇంట్లో ఉన్న ఫర్నిచర్ కింద పడిపోతుంది. ఒకవేళ అది 7 నుంచి 7.9 గా నమోదైతే భవనాలు నిట్ట నిలువునా కూలిపోతాయి. దారుణమైన పరిస్థితులు సంభవిస్తాయి.తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాలో మేడారం కేంద్రంగా బుధవారం ఏర్పడిన భూకంపం తీవ్రత 05.0 మాత్రమే. ఇది కూడా కొన్ని సెకన్ల వ్యవధిలోనే భూమి కంపించింది. ఈ స్థాయిలో భూకంపం 1969 లో ప్రసిద్ధ రామక్షేత్రం భద్రాచలంలో చోటుచేసుకుంది. ఇన్ని సంవత్సరాల అనంతరం భూకంపం రావడం ఇదే తొలిసారి.. అయితే మేడారం కేంద్రంగా భూకంపం రావడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. నది ప్రవహించే చోట భూ ప్రకంపనలు వస్తాయి. ఎందుకంటే నది ప్రవాహం దాటికి భూమి లోపల పగులు ఏర్పడుతుంటాయట. అందువల్ల లోపలి పొరల్లో సర్దుబాటు జరుగుతుందట.. మేడారం ప్రాంతంలో భూకంపం రావడానికి కారణం ఇదేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే నదీ పరివాహక ప్రాంతాలు, బొగ్గు గనులు ఉండే ప్రాంతాలలో భూకంపం రావడానికి అవకాశం ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.. అయితే భూపాలపల్లి జిల్లా పరిధిలో బొగ్గు తవ్వకాలు విపరీతంగా జరుగుతున్నాయి. ములుగు లోను మట్టి తవ్వకాలు విస్తారంగా జరుగుతున్నాయి. అందువల్లే భూమి పొరల్లో సర్దుబాట్లు జరుగుతున్నాయి. బుధవారం అలాంటి సర్దుబాట్ల వల్లనే భూకంప తరంగాలు వేగంగా వ్యాపించాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.. ఇక భూ ప్రకంపనలను సిస్మోగ్రాఫ్ అనే యంత్రం ద్వారా నమోదు చేస్తారు. దేశంలో నాలుగు సిస్మోక్ జోన్లు ఉన్నాయి. ఇందులో తెలంగాణ జోన్ 2 లో ఉంది. అయితే ఈ ప్రాంతంలో అత్యల్పంగానే భూకంపాలు వస్తాయట.




# ఐదేళ్ల తర్వాత బాలీవుడ్‌లోకి..

గ్లోబల్‌స్టార్ ప్రియాంక చోప్రా ప్రస్తుతం హాలీవుడ్ ప్రాజెక్ట్‌స్‌తో బిజీగా ఉంది. 'ది స్కై ఈజ్ పింక్' (2019) తర్వాత ఆమె మరే హిందీ సినిమాలో నటించలేదు. ప్రియాంకచోప్రా ఇక పూర్తిగా బాలీవుడ్‌కు దూరం కానుందనే వార్తలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో ఓ హాలీవుడ్ పత్రికకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో హిందీ చిత్రసీమలోకి పునరాగమనంపై ప్రియాంక చోప్రా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. 'వచ్చే ఏడాది తప్పకుండా బాలీవుడ్ సినిమా చేయబోతున్నా. ఖాళీ సమయాల్లో ముంబయికి విచ్చేసి ఇక్కడి దర్శకుల స్క్రిప్ట్స్ వింటున్నా. మంచి కథతో హిందీ ప్రేక్షకుల్ని పలకరిస్తా' అని ప్రియాంకచోప్రా పేర్కొంది. ఇదిలా వుండగా ప్రియాంకచోప్రా, అలియాభట్, కత్రినాకైఫ్ ప్రధాన పాత్రల్లో ఫరాన్‌అక్తర్ దర్శకత్వంలో 'జీలే జరా..' చిత్రం మూడేళ్ల క్రితం మొదలై మధ్యలో ఆగిపోయింది. ప్రియాంక చోప్రా హాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉండటం వల్ల డేట్స్ ఇష్యూస్‌తో ఆ సినిమా ఆగిపోయిందని బాలీవుడ్‌లో ప్రచారం జరిగింది. ఈ వార్తలపై ప్రియాంకచోప్రా స్పందిస్తూ 'వాటిలో ఏమాత్రం నిజం లేదు. ఆ సినిమా ఎందుకు ఆగిపోయిందో మీరు నిర్మాణ సంస్థను అడిగితే బాగుంటుంది' అని సమాధానమిచ్చింది. దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రియాంకచోప్రా బాలీవుడ్ సినిమా సన్నాహాల్లో ఉండటం ఆసక్తికరంగా మారింది.



# డీజే టిల్లు భామ టైసన్ నాయుడు

టాలీవుడ్ యువ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ చిత్రాల్లో ఒకటి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న టైసన్ నాయుడు. భీమ్లానాయక్ ఫేం సాగర్ కే చంద్ర దర్శకత్వం వహిస్తున్నాడు. డీజే టిల్లు భామ నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా బర్త్ డే సందర్భంగా విషెస్ తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు మేకర్స్. సూపర్ కూల్ గ్లామరస్ లుక్‌లో మెరిసిపోతున్న స్టిల్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 14 రీల్స్ బ్యానర్‌పై రామ్ ఆచంట –గోపి ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన టైసన్ నాయుడు టైటిల్, ఫస్ట్ లుక్, గ్లింప్స్ నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. యాక్షన్ ప్యాక్‌డ్ గ్లింప్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రంలో బెల్లంకొండ డీఎస్పీగా కనిపించబోతున్నట్టు గ్లింప్స్ హింట్ ఇచ్చేసింది. బెల్లంకొండ పోలీసాఫీసర్‌గా నటించిన రాక్షసుడు సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి హిట్‌గా నిలిచింది. ఇప్పుడు మరోసారి ఖాకీ చొక్కా వేసుకోబోతుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.



# పుష్ప 2 డామినేషన్ షురూ.. అప్పుడే ఆర్ఆర్ఆర్ రికార్డ్ బ్రేక్..!

సుకుమార్ కాంపౌండ్ నుంచి వచ్చిన మోస్ట్ ఎవెయిటెడ్ సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ . తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై పుష్ప 2 ది రూల్ అన్ని సెంటర్లలో హౌస్‌ఫుల్ షోలతో రన్ అవుతోంది. అల్లు అర్జున్ వన్ మ్యాన్ షోలా సాగుతుందని ఇప్పటివరకు వచ్చిన టాక్ చెబుతోంది. ట్రేడ్ సర్కిల్ కథనాల ప్రకారం ఓపెనింగ్ డేన నైజాం ఏరియాలో ఈ చిత్రం రూ.30 కోట్లు షేర్ రాబట్టింది. ఈ పాన్ ఇండియా డ్రామా ఇప్పటివరకు నైజాం ఏరియాలో (రూ.23.38 కోట్లు) ఉన్న ఆర్ఆర్ఆర్ (RRR)మార్జిన్‌ను అధిగమించేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ట్రేడ్ ఎనలిస్టుల కథనాల ప్రకారం పుష్ప 2 ఓపెనింగ్ వీకెండ్ ముగిసేనాటికి రూ.75 కోట్ల క్లబ్‌లోకి సులభంగా ఎంటరయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇంకేంటి మరి పుష్ప 2 రానున్న రోజుల్లో తెలుగు సినిమా ఇండస్ట్రీ రికార్డులన్నింటిని చెరిపేస్తుందేమో చూడాలంటూ తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు. ఇప్పటికే అభిమానుల డిమాండ్ మేరకు ముంబై, థానే, పూణే, అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా లాంటి ప్రధాన నగరాల్లోమిడ్‌నైట్ షోల (11.55 pm / 11.59 pm)ను కూడా యాడ్ చేశారని వార్తలు వచ్చాయని తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో వచ్చిన ఈ సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.







Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com